బొడిగెపల్లిలో పడకేసిన పారిశుద్ధ్యం

మండల పరిధిలోని బొడిగెపల్లిలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగుకాలువలు సరిగా లేకపోవడంతో ఇళ్లల్లో వాడుకొనే నీరు రోడ్లపై చేరి నిలిచిపోతోంది. స్థానిక ప్రాథమిక పాఠశాల సమీపంలో ప్రధాన రహదారిపై కూడా నిత్యం మురుగునీరు పారుతోంది.

- రోడ్డు పక్కనే చెత్తాచెదారం డంపు
- నీళ్ల తొట్టిలో పెరిగిన నాచు
- పాఠశాల ఎదురుగా పారుతున్న మురుగు
- కన్నెత్తి చూడని అధికారులు



రోడ్డు పక్కన నిండిపోయిన చెత్తాచెదారం



నాచు పెరిగిన నీళ్లతొట్టి



రోడ్డు పక్కనే ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామంలోని క్రీడా ప్రాంగణం సమీపంలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు వీధుల్లో మధ్య నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. అదేవిధంగా డంపు యార్డును తలపించేలా రోడ్డు పక్కనే చెత్తాచెదారం దర్శనమిస్తోంది. పట్టించుకోవాల్సిన అధికారులు గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

నీళ్ల తొట్టిలో నాచు.. తాగేదెలా?

మూగజీవాల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీళ్ల తొట్టిలో నాచు పేరుకుపోయింది. దీంతో మూగజీవాలు నీళ్లు తాగడం లేదని రైతులు చెబుతున్నారు. గ్రామంలో 2015–16లో రెండు నీళ్ల తొట్టిలను నిర్మించారు. ఒక్కోదానికి రూ.10 వేలు నుంచి 15 వేలు వెచ్చించారు. అందులో క్రీడాప్రాంగణం సమీపంలో ఉన్న నీళ్లతొట్టి నాచుతో నిండిపోయింది. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెబుతున్న అధికారులకు ‘నాచుతో నిండిన నీళ్ల తొట్టి కనిపించలేదా?’అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

“చర్యలు తీసుకుంటాం..



గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తీసుకుంటాం. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని చెబుతున్నాం. డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులో వేయాలి. చెత్తాచెదారాన్ని రోడ్డుపక్క వేస్తే సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం.

– గుగులోతు మోహన్‌నాయక్, ఎంపీఓ అక్కన్నపేట మండలం”

సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మహేందర్‌రెడ్డి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న మహేందర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గ పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నామినేషన్‌కు ముందు రంగదాంపల్లి అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

వెంకన్న సాక్షిగా..

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో నామినేషన్ పత్రాలను శ్రీవారి పాదాల చెంత ఉంచి మహేందర్‌రెడ్డి సతీసమేతంగా పూజలు చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ నేతలు దామోదర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించండి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



రశీదు అందిస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: ప్రజలంతా తమ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన 13, 14, 18వ వార్డులలో పర్యటించి ఇంటి పన్నుల వసూలు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు, నల్లా బిల్లులు చెల్లించాలని, వ్యాపారస్తులు తప్పనిసరిగా ట్రేడ్‌లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఆస్తి పన్ను రూ.2. కోట్లు ఉండగా అందులో ఇప్పటి వరకు రూ.కోటి 10 లక్షలు వసూలు చేశామని, మిగతా రూ.90 లక్షలు నెలలోగా వసూలు చేస్తామని చెప్పారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఏప్రిల్ నెలలోనే ఎర్లీ బర్డ్ పథకం కింద ఇంటి పన్నులు ముందస్తుగా చెల్లించినట్లయితే 5శాతం డిస్కౌంట్ లభిస్తుందని చెప్పారు.

– పార్కు పరిశీలన

18వ వార్డులో నూతనంగా నిర్మించిన చిన్నారుల పార్కును కమిషనర్ పరిశీలించారు. పార్కును పరిశుభ్రంగా ఉంచాలని, విధుల్లో నిర్లక్ష్యం వద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు

బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య



మద్దతు తెలుపుతున్న తపస్ నేత హన్మంతరావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య అన్నారు. సిద్దిపేటలో శుక్రవారం నిర్వహించిన తపస్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు మద్దతు తెలుపుతున్నట్లుగా లేఖను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుగా వినిపిస్తానన్నారు. అనంతరం బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి మాట్లాడారు. సమావేశంలో రఘువర్ధన్ రెడ్డి, మురళీధర్, నర్సారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి సెలవుగా ప్రకటించాలి

గోర్‌సేన జిల్లా అధ్యక్షుడు రాజునాయక్



అక్కన్నపేట(హుస్నాబాద్): మాట్లాడుతున్న రాజునాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్)/హుస్నాబాద్‌రూరల్: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా 15న రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి సెలవు దినంగా ప్రకటించాలని గోర్‌సేన జిల్లా అధ్యక్షుడు గుగులోతు రాజునాయక్, గిరిజన నాయకుడు మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం అక్కన్నపేటలో రాజునాయక్ మాట్లాడుతూ దేశంలో 12 కోట్లకుపైగా ఉన్నవారి ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ అన్నారు. ఆయన జయంతి రోజున గత యేడాది మాదిరిగా ఆప్షనల్ హాలిడే కాకుండా పూర్తిస్థాయిలో ఒకరోజు పాటు సెలవును ప్రకటించాలని, ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు నాయక్, అర్జున్ నాయక్, భూక్య శ్రీనివాస్, శ్రీనివాస్ నాయక్, యోగేందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా జరిపించాలని మోహన్ నాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ముస్తాబైన మల్లికార్జునుడి ఆలయం

- నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు
- నాలుగు రోజులపాటు వేడుకలు



కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత



విద్యుత్ వెలుగుల్లో నూతన ఆలయం

వర్గల్(గజ్వేల్): స్థానిక సరస్వతీ క్షేత్రం చేరువలో నూతనంగా నిర్మించిన శ్రీభ్రమరాంబిక, కేతమ్మ సమేత మల్లికార్జున స్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ఠోత్సవాలకు ముస్తాబైంది. ఆలయంలో శనివారం నుంచి మంగళవారం వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఉదయం 8 గంటలకు విగ్రహ గ్రామోత్సవం(ఊరేగింపు), ఆదివారం గోపూజ వివిధ కార్యక్రమాలు జరుగుతాయి. సోమవారం తెల్లవారుజాము 4 గంటలకు గర్తన్యాసం, రత్నన్యాసం, 5 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, సాయంత్రం శ్రీమల్లన్న బోనాలు నిర్వహించనున్నారు. మంగళవారం కొండ పోచమ్మ బోనాల కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక

మల్లన్న ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్‌కు గురువారం రాత్రి మాజీ జెడ్పీటీసీ బాలమల్లు యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘ ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

చిన్నకోడూరు(సిద్దిపేట): విఠలాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా 33కేవీ విద్యుత్ సరఫరా లైన్ ఏర్పాటుతో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో విఠలాపూర్, రంగాయిపల్లిలో శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు.

తార్కిక సామర్థ్యాలపై అవగాహన

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం తార్కిక సామర్థ్యాల(రీజనింగ్ అప్టిట్యూడ్)పై కామర్స్ విభాగం, టైం సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టైం సంస్థ ప్రతినిధులు హుస్సేన్, చారి, ఇబ్రహీం సాజిద్ పాల్గొని విద్యార్థినులకు రీజనింగ్ అప్టిట్యూడ్, రేషియో వంటి పోటీపరీక్షల్లో అడిగే వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్, అధ్యాపకులు డాక్టర్ స్రవంతి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ప్యాకేజీ ఇవ్వని బీఆర్ఎస్



గ్రామస్తులతో మాట్లాడుతున్న మహేందర్

చిన్నకోడూరు(సిద్దిపేట): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే చెల్కలపల్లిని ముంపు గ్రామంగా ప్రకటించినా, బాధితులకు మాత్రం ప్యాకేజీని ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన ఇతర నాయకులతో కలిసి ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు ముంపుబాధితులకు నష్టపరిహారం అందించకుండా, నేడు లేఖలు రాయడం సరికాదన్నారు. బాధితుల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం అందించేవిధంగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పరశురాం యాదవ్, పాకాల భూపతిరెడ్డి, జయంత్, ప్రశాంత్, వినోద్, వెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి, రాములు, అంజవ్వ, చిన్న రాములు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన

రూరల్ సీఐ శ్రీను



సిద్దిపేటరూరల్: మాట్లాడుతున్న సీఐ శ్రీను

సిద్దిపేటరూరల్: సైబర్ నేరాలు, రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన ఉండాలని రూరల్ సీఐ శ్రీను విద్యార్థులకు సూచించారు. తోర్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, గంజాయి లాంటి అంశాలపై షీటీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన లేకపోవడం వల్లే నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. యాప్‌ల ద్వారా డబ్బులు పంపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఫయాజ్‌అలీ, ఉపాధ్యాయులు, షీటీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ మమత, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మొద్దు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దని సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. స్థానిక మహతి విద్యానికేతన్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. షీటీమ్ విధులు, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షబానా ముంతాజ్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మంచి మార్కులు సాధించాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కట్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు. ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రఘు, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన పాఠశాల స్థాయి ఖోఖో పోటీలు



విజేతలతో టోర్నమెంట్ నిర్వాహకులు

గజ్వేల్‌రూరల్: బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో ఖోఖో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల స్థాయి పోటీలు శుక్రవారం ముగిసాయి. క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఖోఖో లీగ్ టోర్నమెంట్‌ను నాకౌట్ పద్ధతిలో నిర్వహించామన్నారు. బాలుర విభాగంలో 10 జట్లు, బాలికల విభాగంలో 14 జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. బాలుర విభాగంలో మంజీరా కాన్సెప్ట్ స్కూల్(ప్రథమ), జెడ్పీహెచ్ఎస్ అహ్మదీపూర్(ద్వితీయ), జెడ్పీహెచ్ఎస్ మునిగడప(తృతీయ), సెయింట్ మేరీస్ హైస్కూల్ ప్రజ్ఞాపూర్(నాల్గవ స్థానం)లో నిలవగా, బాలికల విభాగంలో సెయింట్ మేరీస్ విద్యానికేతన్ ప్రజ్ఞాపూర్(ప్రథమ), జెడ్పీజీహెచ్ఎస్ బాలికల హబ్(ద్వితీయ), జెడ్పీహెచ్ఎస్ అహ్మదీపూర్(తృతీయ), జెడ్పీహెచ్ఎస్ మునిగడప(4వస్థానం)లో నిలిచినట్లు చెప్పారు. విజేతలకు అహ్మదీపూర్‌కు చెందిన విశ్వశాంతి విద్యానికేతన్ కరస్పాండెంట్ విశ్వనాథ్, జెడ్పీజీహెచ్ఎస్ హెచ్‌ఎం రియాజొద్దీన్ బహుమతులను అందజేశారు. రమేశ్, నగేశ్, నరేశ్, ప్రశాంత్, మురళీకృష్ణ, లక్ష్మణ్, ఐలయ్య, నవీన్ పాల్గొన్నారు.

ప్రతి ఊరిలోను బీఆర్ఎస్ జెండా

మద్దూరు(హుస్నాబాద్): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఊర్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని పార్టీ మద్దూరు మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్ అన్నారు. మండలంలోని లద్నూరులో శుక్రవారం నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. రాజిరెడ్డి, సుమలత, నాగేశ్వరరావు, తిరుపతి, ఇన్నారెడ్డి, సుదర్శన్, కుమారస్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



విద్యార్థినితో చదివిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గోవర్ధనగిరి, ఇప్పలపల్లి, మల్‌చెర్వుతండా, మసిరెడ్డితండా, కపూర్‌నాయక్ తండా, నందారం, పోతారం(జే), ధర్మారం గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం జిల్లా విద్యాధికారి(డీఈఓ) శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

సిద్దిపేట వైద్యుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న భాస్కర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వైద్యరంగంలో చేస్తున్న సేవలకు గాను తనకు వైద్య శిరోమణి అవార్డు వరించిందని ప్రముఖ వైద్యుడు భాస్కర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో తేజస్విని కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నుంచి అవార్డు అందుకున్నట్లు చెప్పారు. ప్రజలకు తక్కువ ఖర్చులో కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్య సేవలు అందించడమే తన ముఖ్య లక్ష్యమన్నారు.

కూలీల మృతి బాధాకరం



మాట్లాడుతున్న శ్రీనివాస్

హుస్నాబాద్: జాతీయ ఉపాధి హామీ పనుల్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం సత్వరమే న్యాయం చేయాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నియోజకవర్గ అధ్యక్షుడు రాగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గోవర్ధనగిరిలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మమత, సారవ్వ మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.30 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గాయపడిన కూలీలకు రూ.10లక్షల చొప్పున చెల్లించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు చిరంజీవి, సాయి, రాజేశ్ పాల్గొన్నారు.

నవోదయ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు



బోర్డుపై నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

గజ్వేల్‌రూరల్: జవహర్ నవోదయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న పరీక్షకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామని ఎంఈఓ కృష్ణ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్, బాలుర హబ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, ప్రజ్ఞాపూర్ తదితర ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

యూజీడీలో వ్యర్థాలు వేయొద్దు



వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

గజ్వేల్‌రూరల్: యూజీడీ(అండర్ గ్రౌండ్ డ్రైనేజీ)లో వ్యర్థాలను వేయడం వల్ల మురుగునీరు నిలిచిపోయి సమస్యలు తలెత్తే అవకాశముందని, ప్రజలు వ్యర్థాలను తమ ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య వాహనాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సూచించారు. 14వ వార్డులో యూజీడీలో తలెత్తిన సమస్యను శుక్రవారం పరిష్కరించారు. అదే విధంగా పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారికి జరిమానా విధించారు.

సంక్షిప్త వార్తలు

◆ ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

కొమురవెల్లి(సిద్దిపేట): స్థానిక చెరువువద్ద పలువురు యువకులు ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శివాజీ యూత్ అధ్యక్షుడు బైరి హరీశ్ శుక్రవారం ఆవిష్కరించారు. 19న శివాజీ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించినట్టు యువకులు తెలిపారు. కార్యక్రమంలో రాజు, భరత్, అర్జున్, నవీన్, రవి, మోసిం ఖాన్, భాను పాల్గొన్నారు.

◆ గిరిజన గురుకులం ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు

హుస్నాబాద్‌రూరల్: స్థానిక గిరిజన గురుకులం ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని సేవాలాల్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌నాయక్ డిమాండ్ చేశారు. హన్మకొండలోని ఆర్‌సీఓను కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మధ్య గొడవలు జరుగుతుంటే ప్రిన్సిపాల్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలని పాఠశాలకు వెళ్లిన విద్యార్థి సంఘం నాయకులపై ఫుడ్ కాంట్రాక్టర్ దాడిచేశాడని ఆరోపించారు. విద్యార్థులకు చేరవలసిన ఆహార పదార్థాలను కాంట్రాక్టర్ పక్కదారి పట్టించినా ప్రిన్సిపాల్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గురుకుల పాఠశాల వివాదంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి తదితరులు ఉన్నారు.

◆ బల్బుల తయారీలో శిక్షణ

సిద్దిపేటజోన్: స్థానిక క్రాంతి పాఠశాలలో శుక్రవారం బల్బుల తయారీలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. తెలంగాణ ఇన్నోవేటర్ అవార్డ్ గ్రహీత మల్లేశం ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భగవాన్ రెడ్డి, ప్రిన్సిపాల్ కుమార స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ అనాథ పిల్లలకు జన్మదిన వేడుకలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌లోగల అనాథ పిల్లలకు శుక్రవారం బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేకు కట్‌చేసి దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, బాలవికాస సంస్థ ప్రతినిధులు, నాయకులు లత, జ్యోతి, అమూల్య, సుజాత, అన్నామేరీ, సుజాత, రత్నాకర్‌రెడ్డి, రావుల నర్సయ్య, సంతోష్, రజిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ వాటర్ ఫిల్టర్ వితరణ

బెజ్జంకి(సిద్దిపేట): చిలాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం రూ.25 వేలు విలువగల వాటర్ ఫిల్టర్‌ను పాఠశాలలో అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు నాగరాజు, అజహరొద్దీన్, మనోజ్, ప్రవీణ్, శ్రీరాములు పాల్గొన్నారు.

◆ 11న ఆర్టిజన్ కార్మికుల సమావేశం

సిద్దిపేటరూరల్: ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మెదక్‌లో 11న నిర్వహించనున్న సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న వారంతా హాజరు కావాలని సిద్దిపేట డివిజన్ ఆర్టిజన్ జనరల్ సెక్రెటరీ కనకరాజు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రాఘవాపూర్‌లో శుక్రవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. శ్రీనివాస్‌రెడ్డి, రాజు, భూపాల్‌రెడ్డి, కర్ణాకర్ పాల్గొన్నారు.

◆ 20, 21న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

మద్దూరు(హుస్నాబాద్): ఎస్ఎఫ్ఐ 6వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని చేర్యాల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 20, 21న మహాసభలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

◆ మంద కృష్ణ చిత్ర పటానికి క్షీరాభిషేకం

బెజ్జంకి(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ చిత్ర పటానికి శుక్రవారం బెజ్జంకిలో నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చింతకింది పరశురాములు, పరశురాములు, భూమయ్య, రాజు, ప్రసాద్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు



శిబిరాన్ని ప్రారంభించిన నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్): సత్యసాయి సేవాసమితి హైదరాబాద్ ఎమ్ఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 110 మందికి పరీక్షలు నిర్వహించినట్లు సేవా సంస్థల స్టేట్ మెడికల్ కో–ఆర్డినేటర్ భాస్కరరావు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. వెంకట నరసింహారెడ్డి, యమునారాణి, డాక్టర్ సత్యకుమార్ సేవలందించారు.